క్లుప్తంగా

కోటపల్లి ఎస్సైగా సురేశ్



కోటపల్లి: కోటపల్లి ఎస్సైగా సురేశ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన వెంకట్ గోదావరిఖనికి బదిలీపై వెళ్లగా మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న సురేశ్ కోటపల్లికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై సురేశ్ మాట్లాడుతూ.. మండలంలో శాంతి భద్రతలకు సహకరించాలని, ఎలాంటి ఇబ్బందులున్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

మొక్కలు పంపిణీ

నస్పూర్: తెలంగాణలో వర్షాలు సంవృద్ధిగా కురువాలని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్ తెలిపారు. పట్టణంలోని ప్రతి ఇంటికి సోమవారం ఆరు మొక్కలు పంపిణీ చేశారు. మున్సిపల్ పరిధిలోని నర్సరీలో లక్షా అరవై వేల హోమ్ స్టీడ్ మొక్కలు పెంచినట్టు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, కమిషనర్ రమేశ్, పలువురు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

లక్సెట్టిపేట: పాడి రైతుల సమస్యలను పరిష్కరించాలని మండల కేంద్రంలోని విజయ డెయిరీ ఎదుట తెలంగాణ విజయ డెయిరీ పరిరక్షణ సమితి సభ్యుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాలను డెయిరీకి పోస్తున్న రైతులకు నాలుగు రూపాయల ఇన్‌సెంటివ్ బకాయిలను వెంటనే చెల్లించాలని, మృతిచెందిన రైతులకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ప్రమాదవశాత్తు చనిపోయిన పశువుకు ఫుల్ ఇన్స్‌రెన్సు సౌకర్యాన్ని అందించాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మేనేజర్‌కు అందించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు వీరమల్ల రాజయ్య, వెంకటేష్, రమేష్, శ్రీనివాస్, తిరుపతి, నవీన్, లక్ష్మణ్, సతీష్, రాజు, రాయమల్లు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

నెన్నెల: గ్రామస్థాయిలో బీజేపీని పటిష్టం చేయడానికి ప్రతీ కార్యకర్త సైనికుల్లా పని చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజీ అన్నారు. మేరా బూత్ -సబ్సే మజ్బూత్ అనే నినాదంతో సోమవారం గుండ్లసోమారం, నార్వాయిపేట గ్రామాలను పర్యటించి బూత్‌స్థాయి సమావేశాలు నిర్వహించి కార్యకర్తలను జాగృతం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శైలేందర్‌సింగ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేశవరెడ్డి, జిల్లా కార్యదర్శి గోవర్ధన్, సీనియర్ నాయకులు అజ్మీర శ్రీనివాస్, కోట రాజలింగు పాల్గొన్నారు.

'దశాబ్ది ఉత్సవాల పేరిట ప్రజాధనం వృథా'

మంచిర్యాలటౌన్: దశాబ్ది ఉత్సవాల పేరిట ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ పట్టణ నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు మాట్లాడారు. మంచిర్యాల పట్టణ మున్సిపల్ పాలకవర్గం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల పేరిట వృథా చేసిన ఖర్చులను, అవకతవకలపై పూర్తి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు వంగపల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శి బోయిని హరికృష్ణ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొద్దున మల్లేశ్, పట్టణ యువమోర్చా అధ్యక్షుడు రాకేశ్ రెన్వా, ముదాం మల్లేశ్, ఆకుల సంతోశ్, బల్ల రవి, బింగి సతీశ్, పూదరి రమేశ్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక

జన్నారం: మండలంలోని కలమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన శ్రీరాముల సంహిత బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు హెచ్ఎం జాడి ప్రభాకర్, సంహిత తండ్రి సత్యనారాయణ సోమవారం తెలిపారు. సంహిత పది జీపీఏ పాయింట్లు సాధించి, జిల్లాలో పేరు తెచ్చుకోవడమే కాకుండా మేధా ట్రస్టు వారి ఆధ్వర్యంలో కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత బోధనకు, ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడంపై పాఠశాల ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు.

మందమర్రిరూరల్: స్థానిక మోడల్ స్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థినులు (డి. సాయి సుశ్రిత, బి.స్ఫూర్తి, ఎం.సాయిష్మ, సీహెచ్ సంజన, ఏ.హన్సిక) ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారని సోమవారం పాఠశాల ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

పరిశుభ్రత పాటించాలి

లక్సెట్టిపేట: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వైద్యారోగ్య శాఖ సీహెచ్‌వో రామమూర్తి అన్నారు. మండలంలోని వెంకట్రావుపేట, స్థానిక మహాత్మాజ్యోతిబాపూలే, గురుకుల పాఠశాల, కస్తూర్బాగాంధీ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు అవగాహన కల్పించి మాట్లాడారు. వసతి గృహాల్లో విద్యార్థులు పరిశుభ్రతను పాటించడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. పీహెచ్‌సీ సిబ్బంది వసతిగృహాల విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అనంతరం విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

- ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు

రామకృష్ణాపూర్: గురుపౌర్ణమి వేడుకలను పట్టణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంతో పాటు రామాలయంలోని సద్గురు దత్తసాయి పీఠంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కాగడహారతి, పంచామృతాభిషేకం, దత్త సాయి హోమం తదితర పూజలను నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: స్థానిక సాయిబాబా ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు చేపట్టారు. బాబా పల్లకిసేవలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఏరియా జీఎం దంపతులు మోహన్‌రెడ్డి-యశోద ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు శ్రీకరాచారి, ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్, రాజలింగు, వెంకటేష్, అనిధర్‌రెడ్డి ఉన్నారు.

మంచిర్యాలఅర్బన్: పౌర్ణమి సందర్భంగా వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గోదావరి తీరాన గౌతమేశ్వర ఆలయం, శ్రీరామాసహిత సత్యనారాయణ స్వామి సన్నిధిలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. 11జంటలు పాల్గొన్నాయి. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అంతర్జాతీయ సీనియర్ ఉపాధ్యక్షుడు ముక్తా శ్రీనివాస్, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ బాలమోహన్, వాసవి క్లబ్ అధ్యక్షుడు నల్మాస్ ప్రవీణ్ పాల్గొన్నారు.

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలోని సాయి రాంనగర్‌లో గడప ఉషాదేవి రాజన్న షిర్డీ సాయి బాబా దేవస్థానంలో గురుపౌర్ణమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సాయిబాబాకు పాలాభిషేకం చేశారు. ఉదయం నుంచి భక్తులు బారులు తీరి బాబాను దర్శించుకున్నారు. ఎమ్మెల్యే దివాకర్‌రావు దంపతులు సాయి బాబాను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గడప రమేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



మంచిర్యాలఅర్బన్: సాయి బాబాను దర్శించుకుంటున్న భక్తులు

చెన్నూర్: పట్టణంలోని సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా భక్తులు సందడి చేశారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయంలో అర్చనలు, అభిషేకాలు నిర్వహించి బాబాకు మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్న హారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఉపాధ్యాయులు రామస్వామిని గురుకృపా, వాకర్స్ సభ్యులు సన్మానించారు.

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీ సత్య నారాయణస్వామి ఆలయంలో ఆషాడ(గురు) పౌర్ణమి జాతర ఘనంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి సత్యదేవున్ని దర్శించుకున్నారు. 142జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు. జాతర సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. భక్తుల రద్దీతో ఆలయ ప్రాంగణాలు సందడిగా కనిపించాయి.

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఆర్కే 8 కాలనీలోని శ్రీ షిర్డి సాయిబాబా ఆలయంలో సోమవారం గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బాబాకు 108కళశాలతో పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం బాబాను పూలతో అలంకరించి హారతీ నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు బాబాను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ముక్త రవి, శ్రీరాంపూర్ ఎస్సై రాజేశ్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ రాజేంద్ర పాణి, కౌన్సిలర్ కుమార్, ఆలయ పూజారీ గోవర్ధన వెంకటచార్యులు పాల్గొన్నారు.

గురు దేవోభవ కార్యక్రమం



కోటపల్లి: స్థానిక జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గురిపూర్ణిమను పురస్కరించుకుని పాఠశాలలో గురుదేవోభవ కార్యక్రమం నిర్వహించారు. విశ్వగురు వేదవ్యాసుడుకి పూజ నిర్వహించిన అనంతరం తొలిమెట్టు కార్యక్రమంలో విద్యార్థులకు దిశానిర్దేశం చేస్తున్న పాఠశాల హెచ్ఎం బాణాల లక్ష్మీనారాయణ, టీఎల్ఎం మేళాలో రాష్ట్రస్థాయికి ఎంపికైన ఉపాధ్యాయుడు బుచ్చన్నను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకర్, అంజన్‌కుమార్, నాగన్న, బాపు, నవీన్ పాల్గొన్నారు.



దండేపల్లి: సత్యదేవున్ని దర్శించుకుంటున్న భక్తులు



రామకృష్ణాపూర్: పూజల్లో పాల్గొన్న భక్తులు



అన్నదానం ప్రారంభిస్తున్న జీఎం మోహన్‌రెడ్డి

'ప్రజావాణి' సద్వినియోగం చేసుకోండి

భీమారం: ప్రజల కోసం ప్రవేశపెట్టిన ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఒక్క ధరఖాస్తు రాలేదు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. పనులు కాలేదని సభలు, సమావేశాల్లో ఫిర్యాదులు చేసే బదులు.. ప్రజావాణికి వస్తే సమస్యలు వెంటనే పరిష్కారం అవుతాయన్నారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెన్నూర్‌లో ఒక్క ఫిర్యాదు..

చెన్నూర్‌రూరల్: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించగా చెన్నూర్ లోని 863సర్వే నెంబర్‌లోని 8గుంటల భూమి అక్రమంగా కబ్జా అయ్యిందని, ప్రభుత్వ భూమిని కాపాడాలని ప్రజావాణిలో ఫిర్యాదు అందించారు. ఇందులో ఎంపీడీవో టి.శ్రీనివాస్, ఎంపీవో అజ్మత్‌అలీ, ఈజీఎస్ ఏపీవో గంగాభవాణి, ఐకేపీ ఏపీఎం ప్రమీల, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



భీమారంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

వేమనపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ లక్ష్మయ్య అధ్యక్షతన ప్రజావాణి నిర్వహించారు. ఎంపీఓ బాపురావు, ఏపీఓ సత్యప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ మాత్రమే ప్రజావాణికి హాజరయ్యారు. మిగితా మండల స్థాయి అధికారులు హాజరుకాలేదు. ఎలాంటి అర్జీలు కూడా రాలేదు.

'ఇంటిని నా పేరున చేయండి'

దండేపల్లి: తన తల్లిదండ్రుల ద్వారా వచ్చిన ఆస్తిలో భాగంగా తన ఇంటిని తనకు తెలియకుండా ఇంకొకరి పేరున చేసి, తనకు అన్యాయం చేశారని జగిత్యాల జిల్లా గోవులాపూర్‌కు చెందిన గాజుల లావణ్య ఆరోపించింది. ఈ మేరకు దండేపల్లిలో తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో సోమవారం ఫిర్యాదు చేసింది. అనంతరం ఆమె తన గోడును విలేకరులకు వెల్లబోసుకుంది. దండేపల్లి మండలం కాసిపేటలో తన తల్లి కమల పేరున(ఇం.నెం:1-74) ఇల్లు ఉంది. తల్లిదండ్రుల మరణాంతరం, ఆ ఇల్లు తన స్వాధీనంలోనే ఉంది. దానికి సంబంధించిన ఇంటి పన్నులు కూడా నేనే చెల్లిస్తున్నాని పేర్కొంది. గతేడాది ఆగస్టులో ఇంటి పన్ను చెల్లించేందుకు, జీపీ కార్యాలయానికి వెళ్లగా, ఇంటి ఓనర్‌షిప్ స్థానంలో తన తల్లిపేరుకు బదులు గ్రామానికి చెందిన సుదవేని వెంకటేష్ పేరు ఉంది. విషయం తెలిసిన వెంటనే మండల పరిషత్ కార్యాలయంలో, ప్రజావాణిలో ఫిర్యాదు చేశాను. తనకు తెలియకుండానే, ఎలాంటి విక్రయ పత్రాలు లేకుండానే, తన తల్లిపేరున ఉన్న ఇల్లును వేరొకరి పేరున చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. తన తల్లిదండ్రుల ద్వారా వచ్చిన ఇంటిని తన పేరున చేయాలని కోరింది. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని వేడుకొంది.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మంచిర్యాలటౌన్: మంచిర్యాలమున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో సోమవారం డీఎంఎఫ్‌టీ నిధులు రూ.34లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులకు ఎమ్మెల్యే దివాకర్‌రావు శంకుస్థాపన చేశారు. చైర్మన్ రాజయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం టీకానపల్లిలో సోమవారం మున్నూరు కాపు భవన నిర్మాణానికి పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్‌నేత, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు భూమిపూజ చేశారు. మున్నూరు కాపు భవన నిర్మాణానికి స్థానికుడు పత్తి వెంకటేశ్ 3గుంటల భూమిని విరాళంగా అందజేయగా, ఆయనను ఎంపీ, ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ స్వర్ణలత, సర్పంచ్ రాంటెంకి మల్లేశ్వరి, రైతుబంధు సమితి మండల కన్వీనర్ పూస్కూరి శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మొగిళి శ్రీనివాస్, జీవన్‌రావు, సర్పంచులు, ఎంపీటీసీలు, స్థానికులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

లక్సెట్టిపేట: రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే దివాకర్‌రావు సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చైర్మన్ కాంతయ్య, వైస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, పట్టణాధ్యక్షులు శ్రీనివాస్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అర్హులకు దళితబంధు అమలు చేయాలి

నస్పూర్/పాతమంచిర్యాల/జైపూర్/మంచిర్యాల రూరల్(హాజీపూర్): అర్హులైన ప్రతీ దళిత కుటుంబానికి దళితబంధు అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి దేవి పోచన్న ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2018ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రాజకీయ జోక్యం లేకుండా దళితబంధుకు లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో జిల్లా కేంద్రంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు మిట్టపల్లి పోలు, సిరికొండ రాయమల్లు, బొక్కెం రాజారావు, కామెర తిరుపతి, మధు, రజిని పానుగంటి యాకోబు, బొడ్డు రాజేష్, జైపూర్‌లో జిల్లా ఉపాధ్యక్షుడు మారపెల్లి రవి, హాజీపూర్‌లో యేసు శంకర్, మేడ లచ్చయ్య, పానగంటి యేసేపు, ఆసాది సతీశ్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శిశువు మృతి ఘటనపై స్పందించిన డీఎంహెచ్ఓ

బెల్లంపల్లి: స్థానిక కృష్ణ మందిర్ రోడ్‌లోని నిత్య పిల్లల ఆసుపత్రిలో వైద్యం వికటించి శిశువు మృతి చెందిన ఘటనపై డీఎంహెచ్ఓ సుబ్బారాయుడు స్పందించారు. జిల్లా మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్‌ను సోమవారం బెల్లంపల్లికి పంపించి నిత్య పిల్లల ఆసుపత్రికి సంబంధించిన వైద్యుడు, సిబ్బంది వివరాలను ప్రాథమికంగా సేకరించారు. ఆ వైద్యుడి వైద్య పట్టా సరైనదేనా, ఆసుపత్రిలో పని చేస్తున్న వైద్యసిబ్బంది అర్హతలు, రోగులకు కల్పిస్తున్న సదుపాయాలు తదితర వివరాలను వెంకటేశ్వర్ నమోదు చేసుకుని వెళ్లారు. ఆ వివరాలను డీఎంహెచ్ఎంకు అందజేయనున్నారు. ఆ తర్వాత శిశువు మృతి చెందిన ఘటనపై డిప్యూటీ డీఎంహెచ్ఓను విచారణ అధికారిగా నియమించి దర్యాప్తు చేయిస్తామని డీఎంహెచ్ఓ సుబ్బారాయుడు తెలిపారు.

సమాచారం

విద్యార్థులకు ఎంపిక పరీక్ష

బెల్లంపల్లి: తెలంగాణ రాష్ట్ర పాఠశాలల్లో 4, 5తరగతుల్లో ప్రవేశం కోసం ఈ నెల 5వ తేదీన విద్యార్థులకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు బెల్లంపల్లి మండల విద్యాశాఖ అధికారి మహేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపా రు. ప్రభుత్వ క్రీడా పాఠశాలలు హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్‌లలో ఉన్నట్లు తెలిపా రు. ఆయా పాఠశాలల్లో ప్రవేశం కోసం మండల స్థాయిలో ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బెల్లంపల్లి కేంద్రంగా ఏఎంసీ క్రీడా మైదానంలో బెల్లంపల్లి, కన్నెపల్లి, భీమిని, నెన్నెల మండలాల విద్యార్థులకు ఎంపిక నిర్వహిస్తామని తెలిపారు. ఉదయం 10గంటలకు విద్యార్థులు క్రీడా మైదానానికి చేరుకోవాలని తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆధార్‌కార్డు, స్కూల్ బోనాఫైడ్ జిరాక్స్ ప్రతులు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో హాజరుకావాలని కోరారు. ఇతర వివరాల కోసం 8790060709, 7013719801నంబర్‌లను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

నేడు పోడు పట్టాల పంపిణీ

బెల్లంపల్లిరూరల్: మండలంలోని పెర్కపల్లి, కన్నాల గ్రామ పంచాయతీలలో పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులకు మంగళవారం ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పోడు భూముల పట్టాలు అందజేయనున్నట్లు ఎంపీడీవో రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రచార కమిటీ చైర్మన్ నియామకం

పాతమంచిర్యాల: తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ ప్రచార కమిటీ చైర్మన్‌గా జిల్లాకు చెందిన సాగే మోహన్‌ను నియమించినట్లు తెలంగాణ మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 02న హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ సమావేశంలో నియామకపత్రం అందించినట్లు తెలిపారు.

16న ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని వైశ్యభవన్‌లో ఈ నెల 16న పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడి ఎన్నిక నిర్వహించనున్నట్లు ప్రస్తుత అధ్యక్షుడు దొంతుల ముఖేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వ్యక్తిగత భద్రత ముఖ్యం

- కార్పొరేట్ జీఎం(సేఫ్టీ) గురువయ్య

శ్రీరాంపూర్: విధి నిర్వహణలో వ్యక్తిగత భద్రత ఎంతో ముఖ్యమని కార్పొరేట్ జీఎం(సేఫ్టీ) గురువయ్య తెలిపారు. ఎస్సార్పీ 3, 3ఏ గనిలో సోమవారం భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 1నుంచి 31వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ఉద్యోగి తన వ్యక్తిగత భద్రతతో పాటు రక్షణ బాధ్యతల గురించి కూడా తెలుసుకోవాలన్నారు. హెల్మెట్ పెట్టుకోవాలని, గనుల్లో పనిచేసేటప్పుడు రక్షణ పరికరాలు ధరించి పని చేయాలన్నారు. రక్షణ నియమాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం కేహెచ్ఎన్ గుప్తా, ఏజెంట్ గోపాల్ సింగ్, గని మేనేజర్ సంతోష్ కుమార్, రక్షణాధికారి శ్రీధర్ రావు, గుర్తింపు సంఘం బ్రాంచ్ ఉపాధ్యక్షుడు సురేందర్ రెడ్డి, గని అడిషనల్ మేనేజర్ మహేందర్, డెప్యూటీ మేనేజర్ చంద్ర ముర్మతో పాటు అధికారులు అరుణ్‌కుమార్, సాయి, శ్రావణ్, ఫిట్ సెక్రెటరీ గోపాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీఎం గురువయ్య

అవయవ దానానికి ముందుకు రావాలి

శ్రీరాంపూర్: అవయవదానానికి ముందుకు రావాలని ఆర్కె న్యూ టెక్ గని మేనేజర్ స్వామిరాజు తెలిపారు. గనిపై సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం అవయవదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం చనిపోయిన తర్వాత మట్టిలో కలిసే అనేక అవయవాల ను ఇతరులకు దానం చేయడం వల్ల, వారికి పునర్జన్మ ఇచ్చిన వారమవుతామన్నారు. ఇప్పటి వరకు తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 1600మందికి నేత్రదానం ద్వారా చూపునిచ్చినట్లు సదాశయ ఫౌండేషన్ సలహాదారులు నూక రమేష్ తెలిపారు. గనిలో మెకానికల్ ఫోర్‌మెన్‌గా విధులు నిర్వర్తించే కే.వెంకటేశం, ఎస్‌డీఎల్ ఆపరేటర్ బుద్ధి ప్రసాద్ అవయవ దానం చేయడానికి అంగీకరించారు. వారిని గని మేనేజర్ ఫౌండేషన్ సభ్యులు ఘనంగా సన్మానించి ప్రశంస పత్రం అందించారు. కార్యక్రమంలో గని రక్షణాధికారి కొట్టే రమేష్, ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, సంక్షేమ అధికారి పాల్‌సృజన్, టీబీజీకేఎస్ నాయకులు పాల్గొన్నారు. ఆర్కే న్యూటెక్ గనిపై రక్షణపై గని మేనేజర్ స్వామిరాజు అవగాహన కల్పించారు.

ప్రమాదరహిత ఉత్పత్తి సాధనకు కృషి చేయాలి

- జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి

జైపూర్: ప్రతి ఒక్కరూ రక్షణ సూత్రాలు తప్పనిసరిగా పాటిస్తూ ప్రమాదరహిత ఉత్పత్తి సాధనకు ఉద్యోగులు, అధికారులు తమవంతు సహకారం అందించాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి తెలిపారు. జైపూర్ మండలం ఇందారం ఓపెన్‌కాస్టు గనిపై సోమవారం భద్రతా అవగాహన డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా ఓసీపీ కార్మికులు, ఉద్యోగులకు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'నా భద్రత నా బాధ్యత.. నా భద్రతే నా కుటుంబ భద్రత' అనే నినాదంతో ప్రతీ ఉద్యోగి ముందుకు సాగాలన్నారు. జులై మాసాన్ని ప్రమాదరహిత మాసంగా చేయాలన్నారు. ఓపెన్‌కాస్టు గనుల్లో పని చేసే ఉద్యోగులు వారి యంత్రాలు షావల్స్, డంపర్లు, ట్రక్కులు పనితీరు పరిశీలించిన తర్వాతే పనులను ప్రారంభించాలన్నారు. పని ప్రాంతాల్లో, వ్యక్తిగత రక్షణ పరికరాలు ధరించి పనులు చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని కోరారు. కార్యక్రమంలో ఓపెన్‌కాస్టు ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్, గని మేనేజర్ రవికుమార్, రక్షణాధికారి సతీశ్, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.



ఐకే-ఓసీపీపై అవగాహన కల్పిస్తున్న జీఎం

బొగ్గుబాయి వార్తలు

ఓసీపీలో రక్షణపై అవగాహన

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓసీపీలో సోమవారం రక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గని ఇన్‌చార్జి మేనేజర్ శ్రీనివాస్ ఉద్యోగులకు రక్షణ నియమాలు తెలియజేశారు. రక్షణతో పని చేయాలని ఉద్యోగులకు సూచించారు. కార్యక్రమంలో గని రక్షణాధికారి సంపత్, సంక్షేమ అధికారి శంకర్, అండర్ మేనేజర్ వెంకన్న, గుర్తింపు సంఘం నాయకులు మంద మల్లారెడ్డి, అధికారుల సంఘం ప్రతినిధి శ్యాంసుందర్‌రావు, ఫిట్ సెక్రెటరీ శంకరయ్య పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాకు ఎస్ఓటు జీఎంగా బదిలీపై వచ్చిన రఘుకుమార్ సోమవారం తన చాంబర్లో బాధ్యతలు చేపట్టారు. ఏరియా జీఎం సంజీవరెడ్డి ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛమిచ్చి స్వాగతం పలికారు. శ్రీరాంపూర్ ఏరియాకు సింగరేణి వ్యాప్తంగా మంచి గుర్తింపు వచ్చేలా కృషి చేస్తానని బాధ్యతలు చేపట్టిన అనంతరం రఘుకుమార్ తెలిపారు. కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ అరవిందరావు, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

శ్రీరాంపూర్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఆర్పీ 1గని మేనేజర్ విజయ కుమార్ తెలిపారు. గనిపై వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏరి యా హెల్త్ ఆఫీసర్ లోకనాథ్ రెడ్డి, గని రక్షణ అధికారి రాజేష్ బాబు, ఇంజనీర్ రాజేందర్, సంక్షేమ అధికారి రాజు, టీబీజీకే ఫిట్ సెక్రెటరీ తిరుపతి పాల్గొన్నారు.

ఆదాయ పన్ను రద్దు చేయాలి

మందమర్రిరూరల్: సింగరేణి బొగ్గు గని కార్మికులకు, ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం ఆదాయ పన్ను రద్దు చేయాలని ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మందమర్రి ఏరియాలోని వర్క్‌షాపును సోమవారం ఆయన సందర్శించి ఉద్యోగులకు నూతన వేజ్‌బోర్డు వేతనాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏఐటీయూసీ ఏరియా ఉపాధ్యక్షులు సుదర్శన్, ఏరియా ఫిట్ కార్యదర్శి శర్మ, నాయకులు బానయ్య, రాజేశం, భూమయ్య, వేణు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

శ్మశాన వాటికను తొలగించాలని వినతి

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని పోస్టు మెట్రిక్ గిరిజన బాలుర హాస్టల్‌ను ఆనుకుని నిర్మిస్తున్న శ్మశాన వాటికను అక్కడి నుంచి తొలగించాలని ఆర్పీ పార్టీ స్టేట్ కో ఆర్డినేటర్ గవ్వల శ్రీకాంత్ సోమవారం మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. శ్మశానవాటికను హాస్టల్ ప్రహరీకి ఆనుకుని నిర్మించడం వల్ల, విద్యార్థులు భయాందోళన చెందుతున్నారని, వేరే చోట స్మశానం నిర్మించేలా చూడాలని కోరారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్టాపన

లక్సెట్టిపేట: మండలంలోని జెండావెంకటాపూర్ గ్రామంలోని మహాలక్ష్మి, భూదేవి ఆలయంలో బొడ్రాయి విగ్రహాలను ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

'నియోజకవర్గంలో టీడీపీకి ఆదరణ'

మందమర్రిరూరల్: చెన్నూర్ నియోజకవర్గంలో టీడీపీకి ఆదరణ పెరిగిందని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ జెండా ఎగరడం ఖాయమని టీడీపీ పెద్దపల్లి పార్లమెంట్ నియోజక అధ్యక్షుడు సంజయ్‌కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. పట్టణంలోని టీఎన్టీయూసీ కార్యాలయంలో సోమవారం జరిగిన పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంజయ్‌కుమార్ నాయకత్వంలో నియోజకవర్గంలో టీడీపీకి పూర్వ వైభవం వస్తుందని ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు గుల్లపల్లి ఆనంద్ పేర్కొన్నారు. సమావేశంలో టీడీపీ, అనుబంధసంఘాల నాయకులు పెద్దపల్లి సత్యనారాయణ, షరీఫా, సమ్మయ్య, మణిరాంసింగ్, కిషన్ రావు, వాసాల సంపత్, సురేందర్ ఉన్నారు.

విద్యార్థులకు బహుమతి ప్రదానం

శ్రీరాంపూర్: సీసీసీలోని సింగరేణి హైస్కూల్‌లో విద్యార్థులకు జీఎం సంజీవరెడ్డి బహుమతి ప్రదానం చేశారు. స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో భాగంగా ఇటీవల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలను నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు జీఎం బహుమతి ప్రదానం చేశారు.

ఆర్థిక సాయం

దండేపల్లి: మండలంలోని మేదరిపేటకు చెందిన ఆవునూరి ప్రణవి కరీంనగర్ ప్రతిమ మెడికల్ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతోంది. ఆమెది నిరుపేద కుటుంబం కావడంతో ఆమె విద్యా ఖర్చుల కోసం క్యాతన్‌పల్లికి చెందిన ఆకిరెడ్డి రవీందర్ రూ.10వేల ఆర్థిక సాయాన్ని సోమవారం విద్యార్థినికి అందించారు.